ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024

నిఘా డొల్ల..

- పోలీస్‌స్టేషన్‌లలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- బీట్‌లకు చాలీచాలని సిబ్బంది..
- సెలవు పెడితే పెట్రోలింగ్ బంద్
- పెరుగుతున్న నేరాల సంఖ్య
- బందోబస్తుకే సగం మంది ఉద్యోగులు
- నియామకాలు చేపడితేనే పటిష్ఠ భద్రత

మహబూబ్‌నగర్, ఆగస్టు 26: పాలమూరు ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో పోలీస్‌శాఖ పోలీసులతో కళకళలాడేది.. అన్ని పోలీస్‌స్టేషన్‌లలో సరిపడా సిబ్బంది ఉండేవారు.. తెలంగాణ ఏర్పాటు తరువాత జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించిన అనంతరం ఇక్కడి సిబ్బందినే అన్ని జిల్లాలకు సర్దుబాటు చేశారు. ఐదు జిల్లాలలో డీపీవో కార్యాలయాలకు సిబ్బందిని కేటాయించడంతో పాటు కొత్తగా ఏర్పాటైన మండలాలకు సర్దుబాటు చేశారు. తరువాత కొత్త స్టేషన్‌లకు కొంతమందిని కేటాయించారు. సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ స్థాయిలో సిబ్బంది కొరత లేకున్నా క్షేత్రస్థాయిలో ఎక్కువగా తిరిగే కానిస్టేబుళ్ల కొరత అన్ని స్టేషన్‌లలో వేధిస్తున్నది. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పెట్రోలింగ్ ఎంత ఎక్కువగా ఉంటే శాంతిభద్రతలు అంత మెరుగ్గా ఉం టాయి. హోంగార్డుల సంఖ్య కూడా తగ్గుతోంది. కొత్తగా హోం గార్డుల నియామకాలు లేకపోవడంతో గతంలో ఎంపికైన వారితోనే నెట్టుకొస్తున్నారు. అందులో రిటైర్డ్ అవుతున్న వారి స్థానంలో ఖాళీల సంఖ్య పెరుగుతూనే ఉంది. హోంగార్డుల బదిలీలు మూడేళ్లకోసారి కావాల్సిన ఉన్నా ఐదేళ్లుగా నిలిచిపోయాయి.

పెట్రోలింగ్‌తోనే శాంతిభద్రతలు

శాంతిభద్రతల పరిరక్షణలో పెట్రోలింగ్ టీమ్‌లది కీలక పాత్ర. పగలు, రాత్రి ఈ టీమ్‌లు ఎంత ఎక్కువ తిరిగితే ప్రజలు అంత అలర్ట్‌గా ఉంటారు. డయల్100 కాల్స్ అటెంట్ చేయాలన్నా, దొంగతనం, గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఇలా ఎలాంటి ఘటనలకైనా పెట్రోలింగ్ టీమ్‌లే ముందుటాయి. ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా పెట్రోలింగ్ టీమ్‌ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కానిస్టేబుళ్ల కొరత కారణంగా నాలుగు టీమ్స్ తిరగాల్సిన చోట రెండు టీమ్‌లను, రెండు టీమ్‌లు తిరగాల్సిన చోట ఒక టీమ్‌ను తిప్పుతున్నారు.. పెట్రోలింగ్ టీమ్‌లతోపాటు స్టేషన్‌లలో రైటర్ల కొరత కూడా తక్కువగా ఉంది. కోర్టు డ్యూటీకి అన్ని స్టేషన్‌ల నుంచి ఒకరిద్దరు కోర్టుకానిస్టేబుళ్లు ఉండనే ఉంటారు.. వీటికి తోడు సైబర్ నేరాలు పోలీసులకు తలనొప్పిగా మారుతున్నాయి. అదేవిధంగా ఉత్సవాలు, పండుగల ర్యాలీలకు బందోబస్తు చేయాల్సి ఉంటుంది. ఇవి ఇలా ఉంటే కొంతమంది పోలీసులకు శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు పౌరసేవలు అందించడం కన్నా సివిల్ వివాదాలలో తలదూర్చడం, ఇసుక అక్రమరవాణా, పొలిటికల్ పంచాయతీలలో బిజీగా ఉండటం వంటి చర్యలు పోలీసులకు అప్రతిష్ఠను తీసుకువస్తున్నాయి. ఇటీవల జోగుళాంబ గద్వాల జిల్లాలో నలుగురు పోలీసులపై వేటుపడటానికి ఇదే కారణమన్న విషయం స్పష్టమైంది.



మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయం

317 జీవో కారణంగా యువమెన్ బదిలీ

గతేడాది 317జీవో కారణంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని జిల్లాల నుంచి 70-100 మంది సైబరాబాద్‌కు బదిలీ అయ్యారు. అయితే బదిలీ అయిన వారిలో అంతా 20-30 ఏళ్లలోపు వయసున్న కానిస్టేబుళ్లే కావడంతో జిల్లాలో ఉన్న పోలీసుల్లో చాలామంది సీనియర్‌లే మిగిలిపోయారు. 45-60 ఏళ్లలోపు పోలీస్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. అందులో పలువురికి దీర్ఘకాలిక సమస్యలున్నాయి. మెన్‌ను పెంచుకు నేందుకు ఆయా జిల్లాల ఎస్పీలు ఎంత ప్రయత్నం చేసినా ఉన్న సిబ్బందితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తు తం కొత్త రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లు శిక్షణలో ఉన్నారు. మరో రెండు, మూడు నెలల్లో వారి శిక్షణ కాలం ముగుస్తుంది. కొత్త నియామకాలలోనైనా ఉమ్మడి జిల్లాలోని ఖాళీలను భర్తీచేయడంతోపాటు అప్‌గ్రేడ్‌కాకుండా కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలీస్‌స్టేషన్‌లకు స్టాఫ్ పెంచాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఎప్పటినుంచో పెండింగ్‌లో కొత్త పోలీస్‌స్టేషన్‌లు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. పెట్రోలింగ్‌ను పెంచితేనే దొంగతనాలు, నేరాలు నియంత్రణలో ఉంటాయి. ఉన్నతాధికారులతోపాటు ప్రజాప్రతినిధులు మెరుగైన శాంతిభద్రతలకోసం నియామాకాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్.. రాష్ట్రంలోని అతిపెద్ద పోలీస్ స్టేషన్‌లలో ఒకటి.. ప్రతీఏటా 650-700 కేసులు నమోదవుతుంటాయి.. రూరల్ మండలం.. పాలమూరు పురపాలికలోని 17 వార్డులు ఈ స్టేషన్ పరి ధిలో ఉన్నాయి. అయినా అప్‌గ్రేడ్‌కు నోచుకోలేని పరిస్థితి. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఉన్న ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలవుతున్నాయి. ఎస్‌ఐ ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఈ స్టేషన్ పరిధికి 28 మంది కానిస్టేబుళ్ల అలకేషన్ మాత్రమే ఉంది. ప్రస్తుతం 20 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇంతపెద్ద విస్తీర్ణం కలిగిన ఈ స్టేషన్ పరిధిలో కేవలం రెండు బ్లూకోల్ట్ టీమ్‌లు, ఒక పెట్రోలింగ్ కారు మాత్రమే బీట్ నిర్వహిస్తోంది.. ఇందులో ఎవరైన సెలవు పెడితే ఆరోజు బీట్ అంతే.. ఈ స్టేషన్ పరిధిలో పది బీట్‌లు తిరగాల్సి ఉండగా రెండు బీట్‌లను తిప్పుతున్నారు.
- జాతీయ రహదారిపై కొత్తగా ఏర్పాటైన రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డ్‌లను కేటాయించగా ప్రస్తుతం 12 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. తొమ్మిది కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బ్లూకోల్ట్ టీమ్‌లు రెండు ఉండాల్సి ఉండగా సిబ్బంది కొరత కారణంగా ఒక టీమ్ మాత్రమే బీట్ నిర్వహిస్తుంది. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ కేసుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ స్టేషన్ పరిధిలో 2021లో 255 కేసులు, 2022లో 344, 2023లో 407 కేసులు, ఈ ఏడాది ఆగస్టు 25 నాటికి 198 కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతీఏటా కేసుల సంఖ్య పెరుగుతోందని గణంకాల ద్వారా తెలుస్తున్నది.
- మహబూబ్‌నగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో పరిధిలో 40 మంది కానిస్టేబుళ్లకు గాను ప్రస్తుతం 30 మంది ఉండగా, 10 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో గొడవలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇక్కడ కూడా రెండే బ్లూకోల్ట్ బీట్‌లు నిర్వహిస్తున్నాయి.

బాస్కెట్ బాల్ చాంపియన్స్
హైదరాబాద్, మేడ్చల్

- రన్నర్‌గా నిలిచిన వికారాబాద్ - మూడో స్థానంలో రంగారెడ్డి, మేడ్చల్



బాలికల విజేత మేడ్చల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీఎస్పీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 26: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 5వ రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్ బాల్ టోర్నీ ముగిసింది. సోమవారం మహబూబ్ నగర్ స్టేడియం మైదానంలో బాలుర విభాగంతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57-53తో వికారాబాద్‌పై గెలిచి విజేతగా నిలువగా, బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 58-56తో వికారాబాద్ గెలిచి చాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా బాల, బాలికల విభాగంలో వికారాబాద్ జట్టు నిలువగా, మూడో స్థానంలో బాలికల విభాగంలో రంగారెడ్డి, బాలుర విభాగంలో మేడ్చల్ జట్లు నిలిచాయి.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. స్టేడియం మైదానంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ విజేతలకు డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీ జిల్లా కేంద్రంలో నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్ మాట్లాడుతూ టోర్నీలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని, టోర్నీ విజయవంతం చేసేందుకు అసోసియేషన్ సభ్యులు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం నుంచి నర్మన్‌ఇసాక్, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి నసూరుల్లా హైదర్ మహ్మద్, ఉపాధ్యక్షుడు సుబహాన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలీద్‌అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, గోపాల్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సాదతుల్లా హుస్సేని, కౌన్సిలర్ రాము, పీఈటీ ముకర్రం, కోచ్ ఖలీల్, పాల్గొన్నారు.



ఫైనల్‌లో బాలుర విభాగంలో తలపడుతున్న హైదరాబాద్, వికారాబాద్ జట్లు

- అంగరంగ వైభవంగా ఎదుర్కోళ్లు
- విద్యుత్ దీపాలంకరణతో వెలిగిపోతున్న ఆలయం
- భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తులు

నేడు జములమ్మ కల్యాణం



కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్ కాంతులతో జములమ్మ ఆలయం

గద్వాల, ఆగస్టు 26: నడిగడ్డలో భక్తుల కోరిన కోరికలు తీర్చేతల్లి.. జములమ్మ కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఆలయం విద్యుత్ దీపాలంకరణలో వెలిగిపోతున్నది. పచ్చని తోరణాలు.. ముత్యాల పందిరితో ప్రత్యేకంగా తయారు చేసిన కల్యాణ వేదిక సిద్ధమైంది. వేలాది మంది భక్తులు తిలకించేందుకు పెండల్స్‌వేసి సిద్ధం చేశారు. ఆలయం బయట విద్యుత్ దీపాలంకరణతో ఆర్చిగేట్లు, రోడ్డు వెంట వివిధ రూపాలలో అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12:15గంటలకు అభిజిత్ లగ్నంలో జమదగ్ని సమేత జములమ్మ అమ్మవారికి మాంగళ్యధారణ నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు.

అంగరంగ వైభవంగా ఎదుర్కోళ్లు

కల్యాణోత్సవ మొదటి రోజు సోమవారం వరుడు జమదగ్నికి ఘనంగా ఎదుర్కోళ్లను నిర్వహించారు. సాయంత్రం వరుడు జమదగ్నిని ఆలయంలోకి తీసుకరావడా నికి బాజా భజంత్రీలతో జమ్మిచేడులోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి అక్కడ ఘనంగా ఎదుర్కోళ్లను నిర్వహించారు. అక్కడి నుంచి జమదగ్నిని ఊరేగించారు. ప్రత్యేక ఆకర్షణగా మిరిమట్లు గొలిపే లైటింగ్‌లో బాజా భజంత్రీలు, డప్పువాయిద్యాలు, కుర్వడోళ్ల చప్పట్లతో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ కుర్వ గాయత్రి, మాజీ చైర్మన్ కుర్వ సతీష్‌కుమార్, ఈవో పురేందర్ కుమార్, డైరెక్టర్లు ఓంప్రకాష్ కామ్లే, అభిలాష్ మాజీ డైరెక్టర్ మేడికొండ జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించిన తర్వాత జమదగ్ని, జములమ్మ ఉత్సవ మూర్తులతో కల్యాణ వేదిక వరకు తీసుకువస్తారు. ఆలయం తరుపున పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరిస్తారు. అదేవిధంగా ప్రజా ప్రతినిధులు తీసుకువచ్చే పట్టు వస్త్రాలతో కూడా అలంకరిస్తారు. మధ్యాహ్నం 12:15 గంటలకు అభిజిత్ లగ్నంలో జమదిగ్ని సహిత జములమ్మ అమ్మవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

కల్యాణోత్సవం తర్వాత బుధవారం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలోకి ఉంచి బాజా భజంత్రీలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.



ప్రత్యేక అలంకరణలో జములమ్మ అమ్మవారు

తాళం వేసిన
ఇంట్లో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 26: తాళం వేసిన ఇంటికి కన్నం చేసి దొంగతనానికి పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో నివాసం ఉంటున్న టెలికాం రిటైర్డు ఉద్యోగి గోపి ఓంకార్ ఈ నెల 21న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కర్నూల్ జిల్లా జిల్లా ఆదోనికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చేసరికి తాళం విరగొట్టి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఒక బంగారు గొలుసు, రెండు గాజులు, నాలుగు జతల కమ్మలు, వెండి లక్ష్మీదేవి బిళ్లలు, దీపాలను అపహరించుకుని వెళ్లారు. ఈ సంఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

అనుమతులు లేని
బ్లాస్టింగ్

- భారీ పేలుళ్లకు నుజ్జునుజ్జైన ఎక్స్‌కవేటర్, ఒకరి మృతి
- మృతుడు మధ్యప్రదేశ్ వాసిగా గుర్తింపు



బ్లాస్టింగ్ ధాటికి నుజ్జునుజ్జైన ఎక్స్‌కవేటర్

గట్టు, ఆగస్టు 26 : అనుమతులు లేకుండా చేసిన బ్లాస్టింగ్‌ల ధాటికి ఎగిరిపడిన రాళ్లు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని సల్కాపురం గ్రామ శివారులో జోగన్‌గట్టు క్వారీలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గట్టు ఎస్‌ఐ కేటీ మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విజయ్‌కుమార్‌సింగ్ గొండు (34) కొంత కాలంగా సల్కాపురం గ్రామ శివారులో గల ఏపీపీ కనస్ట్రక్షన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రషర్‌లో ఎక్స్‌కవేటర్ అపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి క్వారీలో ఎక్స్‌కవేటర్ నడుపుతుండగా బ్లాస్టింగ్ చేశారు. పెద్ద పెద్ద రాళ్లు ఎక్స్‌కవేటర్‌పై పడ్డాయి. డ్రైవర్ సీటులో కూర్చున్న విజయ్‌కుమార్‌సింగ్ గొండుపై రాళ్ల పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. క్వారీలో బ్లాస్టింగ్ చేసే సమయంలో ముందు జాగ్రత్తలు పాటించక పోవడంతో ప్రమాదం చోటు చేసుకున్నదని మృతుడి బంధువులు ఆరోపించారు. మృతదేహానికి గద్వాల ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పచెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగ బ్లాస్టింగ్ చేయడానికి ఎలాంటి అనుమతులు లేవని సమాచారం. మృతుడి బంధువు రాజేందర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి న్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సంబురంగా గోకులాష్టమి



మహబూబ్‌నగర్ కృష్ణ టెంపుల్‌లో ముస్తాబైన చిన్ని కృష్ణుడు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఉమ్మడి పాలమూరు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు చేశారు. ఊరూరా కృష్ణుడి చిత్రపటాలు, విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు. 'చిన్ని కృష్ణా.. నిన్ను చేరి కొలుతు..', 'గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా.. ఆటలు చాలయ్యా' అంటూ చిన్నారులు కోలాటం ఆడారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపికలుగా అలంకరించి మురిసిపోయారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కృష్ణుడి శోభాయాత్ర



గద్వాలలో శ్రీ కృష్ణుడి శోభాయాత్ర

ఘనంగా బోనాల ఉత్సవాలు

బాలానగర్, ఆగస్టు 26 : మండలంలోని వివిధ గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో డీజే పాటలు, డప్పు దరువుల మధ్య గ్రామాలు మారుమోగుతున్నాయి. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు బోనాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా గ్రామ దేవతలైన మైసమ్మ, పోచమ్మ తదితర దేవతలకు సంబంధించిన బోనాలు ఒక్కోరోజు ఒక్కో విధంగా నిర్వహిస్తున్నారు. కులమతాలకతీతంగా నిర్వహిస్తున్న బోనాల కార్యక్రమాల్లో అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాలకు మండల స్థాయి నాయకులు పాల్గొనడంతో బోనాల కార్యక్రమాలకు రాజకీయ రంగు పులుముకుంది. సోమవారం గౌతాపూర్ గ్రామంలో నిర్వహించిన బోనాల కార్యక్రమాల్లో అధికార పార్టీ మండల స్థాయి నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయక్, యాదయ్యగౌడ్ తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు. గత ఉత్సవాల్లో గ్రామ స్థాయి బీఆర్ఎస్ లీడర్లు హల్‌చల్ చేస్తే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుల గాలి నడుస్తోందని ప్రజలు చర్చించుకోవడం కన్పించింది. మెజార్టీ ప్రజలు మాత్రం రాజకీయాలకతీతంగా భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



గౌతాపూర్ గ్రామంలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

చికెన్, మటన్, చేపల వ్యర్థాల తరలింపునకు

రెండో తేదీన బహిరంగ వేలం

జడ్చర్ల, ఆగస్టు 26 : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని చికెన్, మటన్, చేపల వ్యర్థాల తరలింపునకు సెప్టెంబరు రెండో తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్, మటన్ వ్యర్థాల తరలింపు కోసం పోటాపోటీ, జడ్చర్లలో కేవలం రూ.75 వేలకే రెన్యువల్ చేశారంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమయ్యింది. ఈ కథనంపై పాలకవర్గంలో చర్చించి, వ్యర్థాలను తరలించేందుకు టెండర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని, ఆ నిర్ణయానికనుగుణంగా బహిరంగ వేలం చేపడుతున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. అందుకు సంబంధించి మునిసిపల్ కమిషనర్ బహిరంగ వేలం ప్రకటించారు. వేలంలో పాల్గొనే వారు రూ.15వేల దరఖాస్తు రుసుము, రూ.రెండు లక్షలు డిపాజిట్ చెల్లించాలని, దరఖాస్తులను ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు మునిసిపల్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ రెండో తేదీన మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో దరఖాస్తుదారుడు మాత్రమే పాల్గొనాలని సూచించారు. వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఈవీఎంలను నిషేధించాల్సిందే

- ప్రజల కోసమే బహుజన్ ముక్తి పార్టీ ఆవిర్భావం
- పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాస్‌రాంనాయక్



ఐక్యతను ప్రదర్శిస్తున్న బీఎంపీ నాయకులు

పాలమూరు, ఆగస్టు 26 : ఈవీఎంల నిషేధంతోనే రాజ్యాంగబద్ధ ఎన్నికల నిర్వహణ సాధ్యమవుతుంది. ప్రజల కోసం, ప్రజల చేత నిర్మాణమైన పార్టీ బహుజన్ ముక్తి పార్టీ(బీఎంపీ)అని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాస్‌రాంనాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ భవనంలో జిల్లా రెండో మహాసభలను నిర్వహించారు. అనీసూర్ రెహమాన్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో దాస్‌రాంనాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు అంసోల్‌లక్ష్మణ్, ముఫ్తీ మహమ్మద్ ఫహీముద్దీన్, వలిగి ప్రభాకర్, వి.ధర్మయ్య, వి.బల రాంలు ముఖ్య అతిథులుగా హాజరై, ప్రసంగించారు. దేశంలో ఏడు అంశాలపై ప్రత్యేకంగా విస్తృతమైన చర్చలు చేసి అనంతరం తీర్మానాలు చేసుకున్నట్లు మీడియాకు తెలిపారు. ఓబీ సీల కులాల ఆధారిత జనగణన చేయకపోవటం రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికా రాలను వారికి ఇవ్వడానికి నిరాకరించటం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేసు కుంటున్న లావణి, పోడు భూములకు పట్టాలివ్వకపోవటం, అభివృద్ధి, సెజ్‌ల పేరుతో వారి భూమిని లాక్కుని వారి భూమిలోనే వారిని కూలీలుగా మార్చటం దారుణమన్నారు. బహు జన సమాజానికి చెందిన విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, మహిళలు అందరు రాష్ట్ర మహాసభలలో చేసిన తీర్మానాలను అమలు చేయాలని కోరారు.

లేత మనసుకు గాయం

- బాలికలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ఎక్కువ కేసుల్లో దగ్గరివారే నిందితులు
- ఈ ఏడాది 17 పోక్సో కేసులు నమోదు

వనపర్తి క్రైం, ఆగస్టు 26: చిన్నారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ప్రతీ రోజు ఎక్కడో ఒక చోట ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటుండడంతో ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ఘటనల్లో నిందితులు ఎక్కువగా బంధువులు, చుట్టుపక్కల వ్యక్తులే ఉంటున్నారు. దీంతో బాలికల చదువు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బాలికలకు ఎదిగే వయసులో ఏది మంచో ఏది చెడో తెలియదు. ఇదే అదునుగా భావించి కొంతమంది ఆకతాయిలు వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. కొందరు అశ్లీల చిత్రాలకు అలవాటు పడి బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.

● **అవగాహన కార్యక్రమాలు**

జిల్లాలో కళాశాలలు, పాఠశాలలతో పాటు బస్టాండ్ వంటి ప్రాంతాల్లో షీ టీం బృందాల ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆకతాయిల నుంచి మహిళలు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వారి బారినపడితే ఎలాంటి ప్రమాదం జరుగుతుందో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అదే విధంగా ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు డయల్ 100కు ఫోన్ చేసి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కూడా సూచిస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులపై పోలీస్ శాఖ కూడా తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేసి చైతన్యం చేస్తున్నారు.

● **తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి**

తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నప్పుడు వారిపై ఓ కన్నేసి ఉంచాలి. పాఠశాలలకు వెళ్తున్నారా బయటికి వెళ్తున్నారా అని అక్కడికి వెళ్లి తెలుసుకోవాలి. మగవారితో ఎలా ఉండాలి వంటి అంశాలపై కూడా తల్లిదండ్రులు పిల్లలకు ప్రతినిత్యం సూచించాలి. చాలా మంది తల్లిదండ్రులు చిన్న వయసులోనే స్మార్ట్‌ఫోన్ ఇప్పిస్తుండడంతో వారు నిత్యం ఫోన్‌లలో మాట్లాడుకుంటూ చాటింగ్ చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారు. సెల్‌ఫోన్‌లను కూడా సాధ్యమైనంత వరకు దూరం పెట్టేలా చర్యలు తీసుకోవాలి.



మహిళలు, విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్పీ ఆర్.గిరిధర్

ఆకతాయిలు వేధిస్తే షీ టీంకు ఫిర్యాదు చేయాలి

మహిళలు, చిన్నారులు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలి. చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇంటి నుంచి బయటికి వచ్చినప్పుడు ఎక్కడైనా ఆకతాయిలు మహిళలను, చిన్నారులను, విద్యార్థునులను వేధిస్తే వెంటనే డయల్ 100కు లేదా 6303923211 నెంబర్‌కు ఫోన్ చేయాలి. పోలీస్ శాఖ ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండడంతో పాటు ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటుంది.

- అంజద్, షీ టీం ఎస్ఐ వనపర్తి



● **ఈ ఏడాది 17 పోక్సో కేసులు**

ఈ ఏడాది వనపర్తి జిల్లాలో 17 పోక్సో కేసులు నమోదయ్యాయి. 2022లో 30, 2023లో 29 కేసులు నమోదు అయ్యాయి. లైంగిక దాడుల కేసుల్లో పోలీసులు విచారణ, దర్యాప్తు వేగవంతంగా చేపడుతున్నారు. ఆరు నెలల్లో చార్జీషీట్ దాఖలు చేస్తున్నారు. జిల్లాలో పోక్సో కోర్టు అందుబాటులో ఉండడంతో కేసుల విచారణ కూడా వేగవంతం జరిగి నిందితులకు శిక్షలు పడుతున్నాయి. ఈ కేసుల్లో నిందితులకు రెండు సంవత్సరాలపైనే జైలు శిక్ష విధిస్తున్నారు.

సిర్సనగండ్ల దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ స్వామి విగ్రహానికి హారతి ఇస్తున్న అర్చకుడు ధేరం లక్ష్మణశర్మ

చారకొండ, ఆగస్టు 26: మండల పరిధిలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ధేరం మురళీధర్ శర్మ, ధేరం లక్ష్మణశర్మలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, అలంకరణ, తులసినామ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, భక్తులు శ్రీకృష్ణ స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకి సేవలో పెట్టి మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి శ్రీకృష్ణ జన్మవృత్తాంతం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తులు, భజన భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రాజు ఫైల్

తాడూరు, ఆగస్టు 26: అత్తగారింటికి మోటారు సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు బొలెరో వాహనాన్ని ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని పాపగల్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపగల్ గ్రామానికి చెందిన రాజు(25) అనే యువకుడు ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయల్దేరి అత్తగారి ఊరైన వేలుగోములకు బయల్దేరి వెళ్తున్న క్రమంలో సొంత ఊరైన పాపగల్ గ్రామ సమీపంలోనే ప్రమాదవశాత్తు బొలెరో వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతుని తండ్రి చిన్నమల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సిందని ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుని తండ్రి చిన్నమల్లయ్య, తల్లి అంజమ్మతో పాటు భార్య శ్వేత రెండు నెలల కుమారుడు ఉన్నట్లు సమాచారం.

బైక్ ఢీకొని వృద్ధుడు..

బిజినేపల్లి, ఆగస్టు 26 : రోడ్డు దాటుతున్న వృద్ధుడు సత్యనారాయణ(70)ను బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ బిజినేపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలోని తన కుమార్తె దగ్గరకు వచ్చి తిరిగి స్వంత గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు కోసం రోడ్డు దాటుతుండగా పాలెం నుంచి నాగర్‌కర్నూల్ వైపు బైక్‌పై నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన బొంతల వ్యాపారి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ శివకుమార్, పైలెట్ వెంకటయ్యలు హుటాహుటిన నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

కొల్లాపూర్, ఆగస్టు 26: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టిన మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, పురావస్తు, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి శాలువాతో సత్కరించిన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఇంత గొప్ప పదవిని కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవితో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలకు, కాంగ్రెస్ నాయకులకు ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఉన్నారు.

కుమారుడు సహా మహిళ అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

రాజోలి, ఆగస్టు 26 : తన భార్య, కుమారుడు కనిపించడం లేదని, భర్త పోలీ సులకు ఫిర్యాదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజుకు ఎనిమిది సంవత్సరాల క్రితం పావని అనే యువతితో వి వాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారం దరూ గత సంవత్సరం బతుకుదెరువు కోసం బెంగళూర్‌కు వెళ్లి, ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఈ నెల 23న నాగరాజు పనిమీద బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. కానీ ఇంట్లో ఉండాల్సిన భార్య పావని, కుమారుడు విశాల్ కనిపించలేదు. ఇంట్లోనే ఉన్న కుమార్తెలు భూమేశ్వరి, శౌర్యలను అడుగగా, బయటకు వెళ్లినట్లు తెలిపారు. కానీ వారు ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. చుట్టుపక్కల ఇళ్లలో వెతికాడు. బంధువు ల ఇళ్లకు ఫోన్ చేసి ఆరా తీశాడు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం సాయంత్రం రాజోలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

ఊట్కూర్, ఆగస్టు 26 : ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైనట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామానికి చెందిన లోకేశ్వర్‌రెడ్డికి ఊట్కూర్ గ్రామానికి చెందిన జ్యోతితో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల తర్వాత ఊట్కూర్ మండల కేంద్రంలోని భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రోగ్యం కారణంగా మహబూబ్‌నగర్ ఆసుపత్రికి వెళ్తున్నాని చెప్పి ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య జ్యోతి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌కు వెళ్లి వెతికినా కనిపించకపోవడంతో తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లకీ సేవలో ఉత్సవమూర్తుల ఊరేగింపు



శివపార్వతులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్త బృందం

అచ్చంపేటఅర్బన్, ఆగస్టు 26: ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం శ్రావణ మాసం నాలుగవ వారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, హైదరాబాదు, రంగారెడ్డి, నల్ల గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమా మహేశ్వరుడిని దర్శించు కున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరుడికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్వతీ పరమేశ్వరులకు మహిళలు కుంకుమార్చన చేశారు. అనంతరం సాయంత్రం సాయిసేవ భజన బృందం ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు పల్లకీలో భజనలు, కీర్తనలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గుండంలో చక్ర స్నానాలు, త్రిశూల స్నానాలు చేయించి ఆలయం వద్దకు తసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పరిశీలించారు.

గొప్ప నాయకుడు నర్సిరెడ్డి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- నర్సిరెడ్డి విగ్రహం ఆవిష్కరణ

మక్తల్, ఆగస్టు 26 : చివరి శ్వాస వరకు ప్రజాసేవ పరమావధిగా పనిచేసిన గొప్ప నాయకుడు చిట్టెం నర్సిరెడ్డి అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి 95వ జయంతిని పురస్కరించుకొని సోమవారం మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని దండు క్రాస్‌రోడ్ వెల్‌కం బోర్డు వద్ద నర్సిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. ఆయనపై ప్రజలకు ఉన్న నమ్మకమే నేటికీ మా కుటుంబ సభ్యులను గెలిపిస్తున్నారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డ గొప్ప వ్యక్తి అన్నారు. మక్తల్ భీమా, సంగంబండ ప్రాజెక్టు కోసం కృషి చేసి తీసుకువచ్చిన ఘనత ఆయనదే అన్నారు.

భావోద్వేగానికి లోనైన ఎంపీ డీకే అరుణ..

తండ్రి చిట్టెం నర్సిరెడ్డి, తమ్ముడు వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు మరో పది మంది నక్సలైట్ల దాడిలో మృతి చెందడం పట్ల ఎంపీ డీకే అరుణ గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని కంటతడి పెట్టారు. తన తండ్రి ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కొండయ్య, కొత్త శ్రీనివాస్‌గుప్తా, రాజుల ఆశిరెడ్డి, దేవరింటి నర్సింహారెడ్డి, మారుతి గౌడ్, బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గణేష్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



నర్సిరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కొనసాగుతున్న గెల్వలాంబమాత ఉత్సవాలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, ఆగస్టు 26: మండల కేంద్రంలో గెల్వలాంబ మాత ఉత్సవాలు వైభవంగా కొనసాతుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గెల్వలాంబమాతకు ఆడపడచులు బోనమెత్తగా భక్తులు కోడిపుంజులు, పొట్టేళ్లు, మేకపోతులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తెలుగు వారి బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో ఆదివారం రాత్రి డీజే శివ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపదం ఆట పాట కార్యక్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. కళాకారుడు నల్లగొండ గద్దర్, రేలారే గంగా పాల్గొని పాటలు పాడారు. ఈ వేదికపై అధికార పార్టీకి చెందిన పాట పాడటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగారు. పోలీస్‌లు వచ్చి వారిని చెదరగొట్టారు.

గద్వాలలో ఎలుగుబంటి సంచారం

గద్వాల క్రైం, ఆగస్టు 26 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కొత్తహౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం సాయంత్రం ఓ ఎలుగుబంటి ప్రవేశించింది. దీంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్త హౌసింగ్ బోర్డులో సోమవారం సాయంత్రం ఇళ్ల ముందు మహిళలు కూర్చొని ఉండగా, పిల్లలు ఆడుకుంటున్నారు. ఆదే సమయంలో ఆకస్మాత్తుగా ఓ ఎలుగుబంటి కాలనీలోకి ప్రవేశించింది. గమనించిన మహిళలు పెద్దగా కేకలు వేయడంతో అది పరుగులు పెట్టింది. సమీపంలోని పార్కులో వాకింగ్ చేస్తున్న వారికి అది కనిపించడంతో భయాందోళలకు గురయ్యారు. పెద్దగా కేకలు వేస్తూ దాని వెంట పడటంతో అది రైల్వేస్టేషన్ వైపు పరుగెత్తింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కాలనీలోకి ఎలుగుబంటి రావడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సిలర్‌పై పోలీసులకు ఫిర్యాదు

మహబూబ్‌నగర్, ఆగస్టు 26: పాలమూరు పురపాలిక పరిధిలో ఓ కౌన్సిలర్ అక్రమంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకుని అమాయకులను మోసం చేస్తున్నారని పట్టణానికి చెందిన బాధితులు రవీందర్, రవి సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూతన కలెక్టరేట్ ముందు ప్లాట్లను నకిలీపత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని, దీనిపై త్వరలోనే డీజీపీ ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు.

డయాలసిస్ కేంద్రాలతో కిడ్నీ బాధితులకు భరోసా

- ప్రభుత్వ ఆసుపత్రిలో యంత్రాలతో వైద్య సేవలు

కల్వకుర్తి, ఆగస్టు 26 : కిడ్నీ బాధితులకు డయాలసిస్ కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయి. గతంలో జిల్లా కేంద్రంతోపాటు హైదరాబాద్‌లో మాత్రమే అందుబాటులో ఉండేవి. కిడ్నీ వ్యాధిగ్రస్తులు డాక్టర్ల సూచన మేరకు మూడురోజులకొకసారి రక్తశుద్ధి చేయించుకునేవారు. దీంతో దూర, ఆర్థిక భారం కావడంతో ధనిక కుటుంబాలకు చెందిన వారు మాత్రమే హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునేవారు. నిరుపేద కుటుంబాలకు చెందిన కిడ్నీ వ్యాధి బాధితులు ప్రాణాలను కోల్పోవల్సి వచ్చేది.

● **అందుబాటులో డయాలసిస్ కేంద్రాలు...**

డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి(10బెడ్స్), అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో (ఐదు బెడ్స్), కొల్లాపూర్(ఐదుబెడ్స్), కల్వకుర్తిలో(ఐదు బెడ్స్) కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కల్వకుర్తిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఐదు బెడ్స్‌లతో 2023 మే 20న కేంద్రం ప్రారంభమైంది. ప్రతిరోజు నాలుగు స్విఫ్ట్‌ల్లో 17మందికి కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఆరోగ్యశ్రీలో రక్తంశుద్ధి చేసున్నారు. కల్వకుర్తి డయాలసిస్ కేంద్రంలో 39మంది కిడ్నీ బాధితులు పేర్లను నమోదు చేసుకున్నారు. మేనేజర్ పవన్‌తో పాటు ఐదుగురు టెక్నీషియన్లు పని చేస్తున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ గంగాధర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు మేనేజర్ పవన్ తెలిపారు.



కల్వకుర్తి పట్టణంలోని డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

కిడ్నీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగానే యంత్రాల ద్వారా(రక్తశుద్ధి) వైద్య సేవలు అందిస్తున్నాం. కల్వకుర్తి ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం

కేంద్రంలో వైద్య సేవలందిస్తున్నారు

గతంలో జిల్లా కేంద్రానికి డయాలసిస్ కోసం వెళ్లేది. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలోని కేంద్రంలో జనవరి నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఉచితంగానే ఆరోగ్యశ్రీలో రక్తంశుద్ధి చేస్తున్నారు. కేంద్రం ఏర్పాటు చేయడంతో ఎంతో మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపయోగంగా ఉంది.

- వెంకట్‌నారాయణ



నాలుగు షిఫ్టలలో రక్తశుద్ధి

కల్వకుర్తిలోని డయాలసిస్ కేంద్రంలో నాలుగు స్విఫ్ట్‌లలో 17 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రక్తశుద్ధి చేస్తున్నాం. నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ గంగాధర్(వీడియో కాన్ఫరెన్స్) పర్యవేక్షణలో తనతో పాటు ఐదుగురు టెక్నీషియన్లు పని చేస్తున్నాం. ఆరోగ్యశ్రీలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందిస్తున్నాం.

- పవన్, మేనేజర్



కేజీబీవీలో సమస్యల తిష్ఠ

- గదుల కొరతతో విద్యార్థులకు ఇక్కట్లు



డైనింగ్ హాల్‌లో చదువుకుంటున్న విద్యార్థినులు

మానవపాడు, ఆగస్టు 26 : కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. నిర్వహణ సక్రమంగా లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. మానవపాడు మండల కేంద్రంలో 13 సంవత్సరాల క్రితం కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో ప్రతీ ఏడాది విద్యార్థినుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం ఇక్కడ 270 మంది విద్యార్థినులు ఉంటున్నారు. దీంతో ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన భవనంలో సౌకర్యాలు సరిపోవడం లేదు. దీంతో విద్యార్థినులు అరకొర వసతుల మధ్యనే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఉన్న గదులతో పాటు ల్యాబ్, భోజనశాలల్లో కూడా తరగతులను నిర్వహించాల్సి వస్తోంది. దీంతో అక్కడే చదువు, భోజనంతో పాటు అక్కడే నిద్ర పోవాల్సి వస్తోంది.

రోగాల బారిన పడుతున్నాం



జయంతి, ఇంటర్ విద్యార్థిని : ఒకే గదిలో చదువు, అదే గదిలో నిద్ర పోవాల్సి వస్తోంది. ఇరుకు గదుల్లో ఉండటం వల్ల అంటురోగాల బారిన పడుతున్నాం. స్నానపు గదులు తక్కువగా ఉండటంతో ఇబ్బంది అవుతుంది. అస్వస్థతకు గురైతే మందులు కూడా ఇవ్వడం లేదు.

కొత్త భవనం ఏర్పాటు చేయాలి



అర్పణ, ఇంటర్ : ఇంటర్ మీడియట్ విద్యార్థినుల కోసం నూతన భవనం ఏర్పాటు చేయాలి. కనీస వసతులు కూడా కల్పించుకుండా చదువులు కొనసాగించలంటే ఇబ్బందిగా ఉంది. సమయపాలన పాటించలేక చదువుపై శ్రద్ధ తగ్గిపోతోంది. అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలి.

ఉన్నతాధికారులకు తెలిపాం

అనురాధ, ఎస్‌వో : పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని ఉన్నతాధికారులకు తెలిపాం. రెండు నెలలుగా విద్యార్థినులకు మందులు ఇవ్వడంలేదు. నూతన భవనం ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించాలని జిల్లా ఉన్నతాధికారులకు కోరాము.

ఘనంగా విశ్వ హిందూ పరిషత్ షష్టాబ్ది ఉత్సవాలు



అచ్చంపేట ఓం చౌరస్తాలలో విశ్వహిందు పరిషత్ జెండాను ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్

అచ్చంపేట, ఆగస్టు 26: విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భవించి నేటికి అరవై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం అచ్చంపేట ప్రఖండ అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేంకటేశ్వరశర్మతో కలిసి ఓం చౌరస్తాలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి సమైక్యతకు మనమంతా కృషి చేయాలన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరానికి తెలిసివచ్చేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో పరిషత్ షష్టాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. అదే విధంగా చిన్నారులకు చిన్నికృష్ణ గోపికల వేషధారణలో నృత్య ప్రదర్శనతో కోలాటాలతో అలరించి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకున్నారు. నాయకులు నారాయణ, సుధాకర్‌య్య, దామోదర్‌శెట్టి, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

'క్రిస్టియన్లకు ప్రభుత్వ ఫలాలు అందించాలి'

తిమ్మాజిపేట, ఆగస్టు 26 : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన క్రిస్టియన్లకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర క్రిస్టియన్ జే ఏసీ చైర్మన్ జిలకర రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని చర్చి ఆవరణలో సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉమ్మడి మహబూబ్‌నగర్ జేఏసీ చైర్మన్ మీదింటి సురేందర్, జిల్లా కన్వీనర్ సజీవకుమార్, దేవరాజ్, బాలరాజులతో కలిసి ఆవిష్కరించారు. వరుణ్‌కుమార్, సందీప్, సన్నీ, సెహ్వాగ్, శ్రీకాంత్, కృష్ణ, పీటర్‌లు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం



మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

తెలకపల్లి, ఆగస్టు 26 : మండల పరిధిలోని గౌరారం గ్రామ శివారులో గల మల్లికార్జునబండలో వెలసిన భద్రయ్యబావి సమీపంలో మల్లికార్జునస్వామికి సోమవారం రుద్రాభిషేకం జరిగింది. క్రోధి నామ సంవత్సర శ్రావణ బహుళ అష్టమి సోమవారం మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, భూషణ్, శేఖర్, అప్పయ్య, సాంబయ్య, ఆర్.మల్లేష్‌బాబు, కుమ్మరి, బాలస్వామి, బి.మధు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను సిద్ధం చేసి ఇవ్వాలి



కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 26 : డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు సిద్ధంచేసి ఇవ్వాలని సీఐటీయూ, లబ్ధిదారుల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీఐటీయూ కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యేకు, రాష్ట్ర స్థాయి నాయకులకు వినతిపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. 240 ఇళ్లకు లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపికచేసి 15 నెలలు కావస్తున్నదని, వెంటనే వారికి ఇళ్లను అందజేయాలని కోరారు. ఇందుకు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం అంతర్గత పనులు పూర్తిచేస్తున్నారని, విద్యుత్ సరఫరాకు మరిన్ని మౌలిక వసతులకోసం ఇప్పటికే రూ.55 లక్షలు మంజూరుచేసి పనులు చేపట్టారన్నారు. పనులు పూర్తికాగానే లబ్ధిదారులకు అందజేస్తామని వారు వివరించారు. సీఐటీయూ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, డబుల్‌బెడ్‌రూం కమిటీ ఉపాధ్యక్షుడు నర్సింహ, నాయకులు సాయిబాబు, శ్రీనివాసులు, బాలకృష్ణ, వెంకటాచారి, తిరుపతయ్య, మహిళలు పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ జి.మాధవరెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు

కల్వకుర్తి, ఆగస్టు 26 : యువత క్రమశిక్షణతో క్రీడల్లో రాణించి జీవితంలో స్థిరపడాలని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్లను సోమవారం ఎస్ఐ జి.మాధవరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే రిజర్వేషన్ సౌకర్యం కూడా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు మాట్లాడుతూ వచ్చే నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ గ్రౌండ్‌లో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్-14, 16, 18, 20సంవత్సరాల విభాగాల్లో సెలక్షన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

జిల్లా నలుమూలల నుంచి 400మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 30 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్వాములు తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.విజేందర్‌యాదవ్, జాయింట్ సెక్రటరీ పి.పరుశరామ్, వైస్ ప్రెసిడెంట్ భిక్షపతి, పీడీలు శ్రీనుయాదవ్, ఎస్.ప్రసాద్, పీఈటీలు నారాయణ, రాజేందర్, భారతి, రాజు, శ్రీశైలం,శివ, అంజి, స్వేరోస్ నాయకులు ఎండి.తురాబ్, భీమయ్య, ఎదిరే మల్లేష్, తల్లిదండ్రులు రమేష్, సురేష్, నాజర్, కేశవులు, మాజీ క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'జనాభా ప్రకారం రిజర్వేషన్ పెంచాలి'

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 26 : జనాభా ప్రకారం రిజర్వేషన్ పెంచాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దళితులకు గతంలో 15శాతం రిజర్వేషన్ కల్పించారని, బీసీలకు 34శాతం ఉంటే వారికి తగ్గించి 24శాతం చేశారని దీంతో చాలా వర్గాలకు చెందిన ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. 78 స్వాతంత్ర్య భారతంలో ప్రస్తుతం పెరిగిన జనాభా ప్రకారం రిజర్వేషన్‌ను కూడా పెంచాలని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు గడ్డం శ్రీను, భీమయ్య, శ్రీనివాసులు, తేజ, ఝాన్సిలక్ష్మీబాయి, రవి, పరుశరాములు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మువ్వ గోపాలుడొచ్చాడురో..

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 26: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ఉదయాన్నే పూజలు చేశారు. పట్టణంలోని శ్రీసత్యసాయి ఆలయంలో ప్రత్యేక ఆరాధన నిర్వహించి చిన్నారి బాలలతో ఉట్టి కొట్టు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారుల చిన్ని కృష్ణుడి వేషధారణలతో శ్రీసీతారామస్వామి ఆలయాన్ని చేరుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చిన్నారి బాలబాలికలు చిన్ని కృష్ణ, రాధ, గోపికల వేషధారణతో ఉట్టికొట్టు కార్యక్రమం నిర్వహించి సంబురాలు చేసుకున్నారు.



జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఉట్టికొడుతున్న చిన్నారులు



వేషధారణలో చిన్నారులు, ఉపాధ్యాయుల బృందం

● పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలు, పెంట్లవెల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మల్లేశ్వరంలో ఉత్సాహంగా ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు ఆర్.వెంకటస్వామి, బాలరాజు, రాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో..

● మన్ననూర్: మండలంలోని మన్ననూరు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కృష్ణుడి డోలారోహరణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉట్లు కొట్టే కార్యక్రమం ఉంటుందని యాదవ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సురేష్ యాదవ్, పుల్లయ్య యాదవ్, చంద్రయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: మండలంలోని గంగారం, వట్టెం వడ్డెమాన్, ఖానాపూర్, పాలెం గ్రామాల్లో శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పంచామృతాలు, విశేష పూజలు, గీతాపారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేకంగా అలంకరించుకొని ఆకర్షణగా నిలిచారు. ఆలయాల వద్ద సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు కనుల పండువగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు.



గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు భూమిక, అరుష్

● పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో యాదవులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెద్దకొత్తపల్లి దేవునితిర్మలాపూర్, కల్వకోల్, సాతాపూర్ తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుని గోపికల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల ముందు శ్రీకృష్ణుని విగ్రహాలు పెట్టి యాదవులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టిగొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు పి.విష్ణుయ్య, పిల్లి శేఖర్, ఏదుల కుర్మయ్య, పిల్లి నాగరాజు, పెద్ద ఈశ్వరయ్య, భాగి శేఖర్, దాదమల్లయ్య, పశుపతి కురుమూర్తి, దాదికుర్మయ్య, చంద్రయ్య, లాలయ్య, సింగారం నారాయణ, శేఖర్, దామోదర్, రాంబాబు, సాయిశంకర్, మల్లేష్, శివ సింగారం, వెంకటయ్య, దండు నరసింహ, బెట్టరి నాగరాజు, దండు చంద్రయ్య, డబ్బు ఎల్లయ్య, అశోక్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

● కొల్లాపూర్: గోకులాష్టమి వేడుకలను కొల్లాపూర్ మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాధవ స్వామి దేవాలయంలో రామ మందిరంలో శివాలయంలో , వెంకటేశ్వర ఆలయంలో, సింగోటం గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో, సోమశిల గ్రామంలో లలితాంబిక సోమేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని సంబురాలు చేశారు. శ్రీకృష్ణుని చిత్రపటాలతో రైతులు ఎడ్లబండ్లపై ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. ఉట్టి కొట్టిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు గోపిక శ్రీకృష్ణుని వేషధారణలో అలరించారు.

ఘనంగా ఉట్టి వేడుకలు

కొల్లాపూర్: పట్టణంలోని మాధవస్వామి దేవాలయం ఆవరణంలో రాత్రి ఘనంగా ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్టి వేడుకలను 16వ వార్డు కౌన్సిలర్ సిబ్బంది నరసింహరావు ,13వ వార్డు కౌన్సిలర్ మేకల శిరీష కిరణ్ యాదవ్‌లు ప్రారంభించారు. ఉట్టి వేడుకలలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు బహుమతులు అందజేశారు. యాదవ సంఘం నాయకులు సాయిలు యాదవ్, కిషోర్ యాదవ్, కిరణ్ యాదవ్, రామయ్య యాదవ్, సాంబశివుడు, బాలరాజు ఉన్నారు.



కొల్లాపూర్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మునిసిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది



పెద్దకొత్తపల్లిలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాదవ సంఘం నాయకులు

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 26: మహాలక్ష్మీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ బస్ ప్రయాణం పథకంతో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ఆందోళన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కారణంగా ప్రయాణికులు సీట్లు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు ఫ్రీ బస్సు పథకంలో ఉపాధి కోల్పోయిన ఆటో, కారు టాక్సీ డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, కె.గీత, నాయకులు పొదిల రామయ్య, లింగం, వెంకటేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా బస్సులను నడపాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి దశరథం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపాలని మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.



నాగర్‌కర్నూల్ బస్టాండులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2వేల అదనపు బస్సులు పెంచి కాలం చెల్లిన బస్సులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మారుమూల గిరిజన ఆదివాసి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. సీపీఎం నాయకులు పెబ్బేటి శంకర్, పెబ్బేటి ఈశ్వర్, సతీష్ పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

● పెంట్లవెల్లి: ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ బస్సులు కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర అదనపు బస్సులు కల్పించాలని బస్టాండ్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సులు నిత్యం రద్దీగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు. అదనంగా 2000 బస్సులను ఏర్పాటు చేయాలని వారన్నారు. అదే విధంగా మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వారు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు తిమ్మస్వామి, గోపాల్, కుర్మయ్య, బాలరాజు, వెంకటస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● వంగూరు: ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిండంతో ఇబ్బందులు తప్పడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి అన్నారు. ఆర్టీసి బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం వంగూరులో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. అశోక్, శ్రీకాంత్, చరణ్‌తేజ, కిరణ్, చందు, లోకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

● కొల్లాపూర్: కొల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రజలకు ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ మాట్లాడారు. సీపీఎం కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి సలీం, మండల నాయకులు చంద్రు నాయక్, జల్లాపురం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి పుర చైర్మన్‌కు లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, ఆగస్టు 26 : కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించే స్థాయి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంకు లేదని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. గత బీఆర్ఎస్ పాలనలో కల్వకుర్తి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదని ఆయన విమర్శించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ మాట్లాడారు. ఈ నెల 22న జరిగిన బీఆర్ ఎస్ ధర్నాలో చైర్మన్ ఎడ్మ సత్యం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిలపై స్థాయికి మించి ఆరోపణ చేయడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. కల్వకుర్తి మునిసిపల్‌లో ప్రైవేట్ వ్యక్తిను అడ్డం పెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. త్వరలో జరగబోయే మునిసిపల్ ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఎడ్మ సత్యం గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆనంద్‌కుమార్ సవాల్ విశారు.

అనంతరం కాంగ్రెస్ నాయకుడు సంజీవ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేని విమర్శిస్తే సహించేది లేదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కోఫరెడ్డి లక్ష్మీలు మాట్లాడారు.

విలేకర్ల సమావేశంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, ఎజాస్, రవీందర్, బాలు, పద్మ, చిన్నా, కమ్లి హనుమాన్‌నాయక్, నాయకులు షానవాజ్‌ఖాన్, సురేందర్‌రెడ్డి, రాములు, శ్రీధర్‌రెడ్డి, లింగా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామరాజు, రామకృష్ణ, వెంకటేశ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేష్మ పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంతువు దాడి

- రెండు లేగ దూడలు మృతి

ఊర్కొండ, ఆగస్టు 26: గుర్తు తెలియని జంతువు దాడిలో రెండు లేగ దూడలు మృతి చెందిన సంఘటన ఊర్కొండ మండలంలోని బొమ్మరాజుపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారిగా తన వ్యవసాయ భూమిలో ఉన్న షెడ్డులో ఆదివారం రాత్రి లేగ దూడలు ఉంచి ఇంటికి వచ్చాను.

భోజనం చేసి తిరిగి వెళ్లేసరికి రెండు లేగ దూడలు మృతి చెంది ఉన్నాయని వాపోయాడు. వరుస ఘటనలతో రైతులు భయాందోళనకు గురువుతున్నారు.

రెండు రోజుల్లో 13 మేకలు, రెండు లేగ దూడలు గుర్తు తెలియని జంతువు దాడిలో ఒకే రైతుకు చెందినవి మృతి చెందడంతో బాధిత రైతుతో పాటు పరిసర ప్రాంత రైతులు భయాందోళనకు గురువుతున్నారు. అటవీ శాఖ అధికారులు గుర్తించి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పర్సు అప్పగించిన పోలీసులు

పెబ్బేరురూరల్, ఆగస్టు 26: ఈ నెల 24న పెబ్బేరు సంతలో హైదరాబాద్‌కు చెందిన జహీర్‌హుస్సేన్ అనే వ్యక్తి పర్సు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దీంతో ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పర్సులో ఉన్న రూ.పదివేల నగదు, రెండు డెబిట్, మూడు ఏటీఎం కార్డులను, విలువైన కాగితాలను సోమవారం సదరు వ్యక్తికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ, పోలీసులకు జహీర్‌హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు.

అసభ్యంగా పోస్టులు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



కల్వకుర్తి సీఐ నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డిసేవా సమితి సభులు

కల్వకుర్తిపట్టణం, ఆగస్టు 26 : సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రెడ్డిసేవా సమితి సభ్యుడు సోమవారం సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఫేస్‌బుక్ అకౌంట్‌లో శరత్‌బాబు ఖానాపూర్ ఖాతానుంచి రెడ్డి కులస్థులపై అనుచిత వ్యాఖ్య లు చేస్తున్నాడని, మహిళలను కించపరిచే విధంగా పోస్టులుపెడుతున్నాడని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ఇలాంటి పోస్టులు పెట్టేవారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని వారు కోరారు. రెడ్డిసేవాసమితి అధ్యక్షుడు పసుల శేఖర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మెహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ భవిష్యత్‌కు సమాధి కడతారు'

అచ్చంపేటటౌన్, ఆగస్టు 26: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అహంకారపూరిత ధోరణి ప్రదర్శిస్తే అచ్చంపేట ప్రజలు నీ రాజకీయ భవిష్యత్‌కు సమాధి కడతారని గిరిజన యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్ అన్నారు. సోమవారం పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని సంవత్సరాల నుంచి మా గిరిజన సోదరులు సంతోషంగా జరుపుకునే కార్యక్రమంలో పాల్గొని ఇరువర్గాల మధ్య గొడవలు ప్రోత్సహించిన గువ్వల బాలరాజుకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఇప్పుడిప్పుడు స్వేచ్ఛ వాతావరణంలో అచ్చంపేట ప్రజలు ఉంటే ఓర్వలేక ప్రజలు మధ్య చిచ్చు పెట్టి నీ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నావని ఆయన ఆరోపించారు. గిరిజన నాయకులు రాజేందర్‌స్వామి, రమేష్, వెంకటేష్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఉప్పునుంతల, ఆగస్టు 26: మండల కేంద్రమైన ఉప్పునుంతలలో సోమవారం ఉదయం కథల రాములమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి మృతురాలు కుమారుడు కృష్ణయ్యకు ఆర్థిక సహాయం అందించారు. మృతురాలు కుటుంబానికి ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు రామచంద్రయ్య, శ్రీనివాసులు, నిరంజన్, కురమయ్య, శేవ్య శేఖర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 26 : మండల పరిధిలోని మారేడు మానుదిన్నె గ్రామానికి చెందిన తమటం జ్యోతికి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అనుచరులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 29వేల రూపాయల చెక్కును సోమవారం బాధితురాలికి అందజేశారు. సింగిల్ విండో డైరెక్టర్ బాలునాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటస్వామిగౌడ్, నాయకులు శ్రీనునాయక్, శంకర్‌యాదవ్, రేనయ్య, సందు జగన్, గన్నోజు బ్రహ్మయ్య, కొమ్ము నిరంజన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడే ఎల్లమ్మ తల్లి బోనాలు

పదర(అమ్రాబాద్), ఆగస్టు 26: ఎల్లమ్మ తల్లి బోనాలు మంగళవారం పదర మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఏఆర్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా చెరువుగట్టు నుంచి వచ్చేన లుగురు జోగినీలు భక్తి శ్రద్ధలతో బోనం తయారుచేస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం జోగినీలతో పాటు గ్రామస్థులు బోనం ఎత్తుకొని సాయంత్రం గ్రామ వీధుల గుండా డప్పుళ్లతో, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తిరుగుతూ గ్రామ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. అదే విధంగా హై దరాబాద్ నుంచి వచ్చే పోతురాజులు విన్యాసాలు ఆకర్షితం గా ఉంటాయని తెలిపారు. ఈ బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు హాజరౌతారని పేర్కొన్నారు.

'రైతుకు కరువైన భరోసా'

తిమ్మాజిపేట, ఆగస్టు 26 : వానాకాలం సీజన్ మరికొద్ది రోజుల్లో ముగుస్తున్నా రైతు పెట్టుబడి సాయం కింద అందజేసే రైతు భరోసా నిధులు కరువయ్యాయని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. తిమ్మాజిపేటలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పెట్టుబడి సాయం ఎప్పుడు వస్తుందా అంటూ రైతులు ఎదురు చూస్తున్నారని ప్రైవేట్ అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త వెంకటేశ్, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ మాధవరెడ్డికి వినతిపత్రం అంజదేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 26 : మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలుచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ముస్లిం జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలో ర్యాలీగా వెళ్లి ఎస్ఐ మాధవరెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన రామగిరి మహరాజ్ అనే పూజారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ముస్లిం జేఏసీ నాయకులు ఏజాస్, తహేర్‌అలీ, సత్తార్, పప్పు, మసూద్, ఖాదర్, విక్కి, సోఫి, సలాం, ఖుద్దుస్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

అమ్రాబాద్, ఆగస్టు 26: అమ్రాబాద్ మండల కేంద్రంలోని గౌడ కులస్తుల ఆరాధ్య దైవం వెంకట లక్ష్మమ్మ తల్లి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అమ్రాబాద్ గ్రామపంచాయతీ మహిళా కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా వారికి చీరలు, వాయినాలు సమర్పించారు. గౌడ్ సంఘం నేతలు, రాజారాం గౌడ్, తిరుపతయ్య గౌడ్, జగన్ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేత

మదనాపురం, ఆగస్టు26: మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన పావనికి ఎస్ఐ శేఖర్‌రెడ్డి సెల్‌ఫోన్ అప్పగించారు. కొన్ని రోజుల కిందట పావని సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితురాలికి అప్పగించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ గాని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.